మిచౌంగ్ తుపాను నష్టపరిహారం రూ.5.90 కోట్లు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వారికి అర్థిక భరోసా కల్పించే దిశగా బుధవారం మధ్యాహ్నం ఖరీఫ్ 2023 వర్షాభావం, 2023 మిచాంగ్ తుపాను వలన నష్ట పోయిన లబ్దిదారులకు తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి బటన్ నొక్కి జమ చేశారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫెరెన్స్ హాలు నుండి తిరుపతి జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మిశ, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, లబ్దిదారులతో కలిసి హాజరయ్యారు. మొత్తం 6996 రైతులకు రూ. 5.90 కోట్లు మెగా చెక్ ను అందజేశారు.

తుమ్మలగుంటలో మఠం అధికారులు కూల్చేసిన ఇళ్లు

పేదలే సమిథలు..!

చెవిరెడ్డి జోలికెళ్లని 'మఠం'

రెవెన్యూపై అనుమానాలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

మఠం భూములు ఆక్రమణలకు గురయ్యాయని ఫిట్ పర్సన్, డిప్యూటీ కలెక్టర్ రమేష్‌నాయుడు స్వయంగా చెబుతున్నారు. అయితే కబ్జాదారుల నుంచి పేదలు కొనుగోలు చేసిన ఇళ్లపై తన ప్రతాపం చూపారే తప్ప, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మీ పేరుతో 22 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని టిడిపి, జనసేన నాయకుల ఆరోపణలపై అటు మఠం అధికారి గానీ, ఇటు రెవెన్యూ అధికారులు గానీ నోరు మెదిపే పరిస్థితి లేదు. చెవిరెడ్డి లక్ష్మీ పేరుతో ఉన్న భూమిలో 'మఠానికి సంబంధించిన భూమి' అని ఎందుకు బోర్డు పెట్టలేదో మఠం అధికారులకే తెలియాలి. పేదల ఇళ్లకు మఠం అధికారులు నోటీసులు ఇచ్చామంటారు.. టిడిపి నేతలు ఇవ్వలేదంటారు.. అసలు మఠం భూముల్లో పేదలు ఇళ్లు కట్టుకుంటుంటే మఠం అధికారులు ఏం చేస్తున్నారు? రెవెన్యూ అధికారులు ఎందుకు గమ్మునే ఉన్నారు.. మఠం భూముల్లో పంచాయతీ, విద్యుత్ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారన్నది అంతుచిక్కని ప్రశ్న. సరిగ్గా ఎన్నికలకు ముందు ఈ రాజకీయం ఏంటన్న చర్చ తిరుపతి రూరల్ తుమ్మలగుంటలో నడుస్తోంది. అసలు పేదలకు ఇళ్లను విక్రయించిన కబ్జాదారులు ఎవరు? ఇవన్నీ మిస్టరీగానే మిగిలిపోయే ప్రశ్నలు. ఏమైతేనేం ఎప్పటిలానే పేదలే సమిథలయ్యారు. కష్టపడి చెమటోడ్చి సంపాదించి అంతో ఇంతో కూడబెట్టిన డబ్బుతో కబ్జాదారుల నమ్మకమైన మాటలు నమ్మి మోసపోయారు.

చెవిరెడ్డి భూములపై నోరు మెదపరెందుకు?

చంద్రగిరి ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచనల మేరకే మఠం అధికారులు పేదలు నిర్మించుకున్న ఇళ్లను

అధికారులను నిలదీస్తున్న పులివర్తి సుధా

కూలదోశారని, చెవిరెడ్డి భార్య లక్ష్మి పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిపై మఠం అధికారులు ఎందుకు నోరు మెదపలేదని పుదిపట్ల సర్పంచి బడి సుధాయాదవ్ ప్రశ్నించారు. బుధవారం తిరుపతి గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం వద్ద పేదలతో కలిసి బైఠాయించారు. పేదల జోలికి రావద్దని, చెవిరెడ్డి ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలని నినాదాలు చేశారు. తుమ్మలగుంట మఠం భూముల్లో భారీ లావాదేవీలు జరిగాయని, ఆక్రమణకు ప్రేరేపించింది, లావాదేవీలు నడిపించి కాసులు వెనకేసుకున్నది ఎంఎల్ఎ కుటుంబేనని విమర్శించారు. తక్కువ ధరకే ప్లాట్లు పేదల చేత కొనిపించి వారికి పన్నులు, విద్యుత్ మీటర్లు సిఫార్సు చేసింది ఎంఎల్ఎ కాదా? అని ప్రశ్నించారు. తుమ్మలగుంటలోని 100 ఎకరాల్లో ఉన్న చెరువును తన ఇష్టానుసారం భౌగోళిక మార్పులు చేసి తుడా నిధులు 150 కోట్లు వృథా చేశారన్నారు.

మఠం భూములు ఎవరూ కొనొద్దు : రమేష్‌నాయుడు

గతంలో హథీరాంజీ మఠం భూముల పర్యవేక్షణ లోపం కారణంగానే నేడు పెద్ద ఎత్తున ఆక్రమణలు చోటుచేసుకున్నాయని, ఆ పొరపాటు కారణంగానే నేడు మఠం సిబ్బంది వ్యయ ప్రయాసల మధ్య భూములను స్వాధీనం చేసుకోవాల్సి వస్తోందని మఠం ఫిట్ పర్సన్, డిప్యూటీ కలెక్టర్ రమేష్ నాయుడు అన్నారు. బుధవారం తొల్లవారం జావంన తుమ్మలగుంటలో హథీరాంజీ మఠంకు చెందిన భూముల స్వాధీనంపై మఠంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. హథీరాంజీ మఠంకు చెందిన భూములు తుమ్మలగుంట పరిధిలోని 7/6, 26/3, 28, 33, 66 నుండి 95, 97, 98, 99, 100, 101 సర్వే నెంబర్లలో దాదాపుగా 165.78 ఎకరాల మఠం భూమి ఉందన్నారు. కొద్దిరోజులుగా సదరు సర్వే నంబర్లలో అనుమతులు లేకుండా అక్రమంగా శాశ్వత నిర్మాణాలను చేపట్టారని, ఫిబ్రవరి నెలలో మఠం సిబ్బంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారికి హెచ్చరికలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. బుధవారం ఆర్డీవో, రెవిన్యూ సిబ్బంది, పోలీసుల సహాయంతో దాదాపు 40 ఇళ్లను నేలమట్టం చేశామన్నారు. ఇంకా నేల కూల్చాల్సిన అక్రమ కట్టడాలు మిగిలి ఉన్నాయని, ఇంకో పర్యాయంలో వాటిని పూర్తిస్థాయిలో తొలగిస్తామన్నారు. మఠం ఏఈఓ శ్రీనివాసరెడ్డి, లా అధికారిని కవిత పాల్గొన్నారు.

రమేష్‌నాయుడు

నిరసన దీక్షలో సిపిఎం నాయకులు సుబ్రమణ్యం, వేణు, బుజ్జి, లబ్దిదారులు

తుడా క్వార్టర్స్ పరిధిలోనే ఇళ్ల స్థలాలివ్వాలి

36 గంటల నిరసన దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఉమ్మడి శెట్టిపల్లె పంచాయతీలో జగనన్న ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు మంగళం పరిధిలోని తుడా క్వార్టర్స్ ప్రాంతంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం, ఇళ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో 36 గంటల నిరసన దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో జగనన్న పట్టాదారులందరికీ తుడా క్వార్టర్స్ ప్రాంతంలోనే ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎక్కడో మంగళం ప్రాంతం నుండి దాదాపు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిందేపల్లిలో పట్టాలకు స్థలాలు చూపడం సమంజసం కాదన్నారు. మంగళం పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, ఆక్రమణకు గురై ఉంటే స్వాధీనం చేసుకొని జగనన్న పట్టాలు పొందిన లబ్ధిదారులకు స్థానికంగానే స్థలాలు చూపాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోతే ఆక్రమణకు గురైన భూముల వివరాలను బహిరంగంగా బయటపెడతామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు సుబ్బు యాదవ్ నిరసన దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడుతూ స్థానికంగా పట్టాలు పొందిన వారికి ఇక్కడే స్థలాలు చూపాలన్నారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. వేణుగోపాల్ మాట్లాడుతూ పేద ప్రజల ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన 36 గంటల నిరసన దీక్షకు అందరూ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తిరుపతి నగర కార్యదర్శి టి సుబ్రమణ్యం, ఎం. మాధవ్, పి.బుజ్జి, డి.పార్థసారధి రెడ్డి, మునిరత్నం, చిన్న వెంకటయ్య, మోదిన్, బాదుల్లా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ముక్కంటి క్షేత్రంలో మహాశివరాత్రి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

దక్షిణ కైలాసంగా పేరు గాంచిన శ్రీకాళహస్తి క్షేత్రంలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

రవాణా సౌకర్యం ఇలా..

తిరుపతి నగరానికి శ్రీకాళహస్తి 38కి.మీ. దూరంలో ఉంది. తిరుపతి బస్టాండు నుంచి ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు సౌకర్యం ఉంది. అదేవిధంగా నెల్లూరు నుంచి నాయుడుపేటు మీదుగా శ్రీకాళహస్తికి రావచ్చు. నాయుడుపేటకు 28 కి.మీ. దూరంలో శ్రీకాళహస్తి ఉంది. ఈ మార్గంలోనూ బస్సు సౌకర్యాలు బాగానే ఉన్నాయి. ఇక చెన్నై నుంచి తడ మీదుగా శ్రీకాళహస్తికి రావాలంటే సుమారు 120 కి.మీ. దూరం ఉంటుంది.

హంస, యాళి వాహనంపై ఆదిదంపతుల పురవిహారం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన బుధవారం ఉదయం గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి బంగారు హంస వాహనం పైనా... జ్ఞానప్రసూనాంబ అమ్మవారు బంగారు యాళి వాహనం పైనా పురవీధుల్లో ఊరేగారు. మూషిక వాహనంపై వినాయక స్వామి, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప వీరిని అనుసరించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన

విద్యా దీవెన బకాయిలు విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్

'విద్యార్థుల చదువులకు నేను గ్యారంటీ' అంటూ చెప్పిన సీఎం జగన్ మోహన్ రెడ్డి కేవలం బటన్ నొక్కుతూ ఫీజులు జమ చేస్తున్నానని ప్రచారం తప్ప ఇప్పటి వరకు లక్షల మంది విద్యార్థుల తల్లుల అకౌంట్ లో ఫీజులు జమ కాలేదని, ఫీజు బకాయిలు ఎలక్షన్స్ నోటిఫికేషన్ లోపు విడుదల చేయాలనీ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తిరుపతి నగరం భవానినగర్ సర్కిల్ లో విద్యార్థులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి భగత్ రవి, అధ్యక్షులు అక్బర్ మాట్లాడుతూ మొన్ననే బటన్ నొక్కాం అని గొప్పలు చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం అన్ని కళాశాల విద్యార్థుల తల్లి అకౌంట్ లలో మాత్రం ఖాళీ అకౌంట్ లు దర్శనం ఇస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, తేజ, శివ, బాల, హార్షద్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఓ లంచావతారం

కారులో వచ్చి పోతాడు...
కంటికి కానరాడన్న విమర్శలు
'ఆరూరు'లో లక్షల్లో అవినీతి..?

ప్రజాశక్తి - చిట్టమూరు

మండల పరిధిలోని ఆరూరు విఆర్ఓగా పనిచేస్తున్న రెవెన్యూ అధికారి ఆగడాలకు హద్దులేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కి పట్టా పాస్‌బుక్కులు, సర్టిఫికెట్లు ఏమి కావాలన్నా తన మాట కాదని, తహశీల్దార్ కూడా ఏమీ చేయలేడనే రీతిలో బహిరంగంగానే ప్రగల్భాలు పలుకుతున్నాడని బాధితులు వాపోతున్నారు. గతంలో ఓజిలి మండలంలో విఆర్ఒగా పనిచేస్తూ అపర కుబేరుడుగా విమర్శలు ఎదుర్కొన్నారు. బాధితుల ఫిర్యాదులు ఎన్ని వచ్చినా బుట్టదాఖలయ్యాయని, ఉన్నతాధికారులు సైతం అతనికి సహకారం అందిస్తున్నందు వల్లే అహంభావంతో విర్రవీగుడుతున్నాడని సమాచారం. బదిలీపై అక్కడనుంచి చిట్టమూరు మండలానికి వచ్చినా బాధితులను పీడించడమే పనిగా పెట్టుకుని లంచాలను దండుకుంటున్నారు. కారులో వచ్చి కారులో వెళ్లడమే తప్ప, ఎపుడూ కంటికి కనిపించడని తెలుస్తోంది.

ఆరూరు గ్రామానికి చెందిన ఓ మహిళ తన పొలం పాస్‌బుక్కు నిమిత్తం విఆర్ఒను కలవగా 50వేలు డిమాండ్ చేయడంతో అంత ఇవ్వలేనని ఆ మహిళ 30వేలు సమర్పించిందని సమాచారం. మరో వ్యక్తి పూర్వీకుల పేరు మీద ఉన్న పొలాన్ని తన మీదకు మార్పించుకునేందుకు అదే విఆర్ఒను కలవగా 30వేలు డిమాండ్ చేశాడని తెలుస్తోంది. మండలంలో రెవెన్యూ సమస్యలు ఎన్నో ఉన్నా ఆ విఆర్ఒకు లంచాలు సమర్పించుకోలేక వెనకడుగు వేస్తుండటం గమనార్హం. ఒకవేళ ఎవరైనా ధైర్యం చేసి తహశీల్దార్ దృష్టికి తీసుకెళితే సంబంధీకులపై ఆ విఆర్ఒ కన్నెర్ర జేస్తూ ఫైల్ కదలనీకుండా చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఆరూరు పెద్ద దళితవాడలో ఎస్టీలకు ఇచ్చిన నివేశ స్థలాల్లో యానాదులు ఎవరూ అక్కడ లేకపోవడంతో దాన్ని ఆక్రమించిన ఓ వ్యక్తిపై 'ప్రజాశక్తి'లో కథనం వచ్చింది. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు పెట్టారు. ఆక్రమణదారుడు విఆర్ఒను ఫోన్‌లో సంప్రదించగా 'కాస్ కొట్టు, బోర్డు తొలగించుకో' అని వత్తాసు పలికినట్లు తెలుస్తోంది. కబ్జాదారులకు కొమ్ముగాస్తున్న విఆర్ఒను సస్పెండ్ చేసి, నిజాయతీపరుని, అందుబాటులో ఉండే విఆర్ఒను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తహశీల్దార్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సి ఉంది. హెచ్చరిక బోర్డు తొలగించిన వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ 'ప్రజాశక్తి'కి వివరణ ఇచ్చారు.

టిటిడి హెల్త్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుమలలో హెల్త్ విభాగంలో తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని టిటిడి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు టి సుబ్రమణ్యం, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ దాదాపు 20సంవత్సరాలు పైబడి పనిచేస్తున్న 300 మంది కార్మికులను అకారణంగా తొలగించడం అన్యాయం అన్నారు. కొత్తగా టెండర్ దక్కించుకున్న డస్టర్ కంపెనీ, పిఎన్ఎస్ కంపెనీ, చైతన్య జ్యోతి కంపెనీలు గతంలో పని చేస్తున్న కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకారణంగా కార్మికుల కడుపులు కొట్టడం మంచిది కాదన్నారు. సిఐటియు నేతలు ఎం మాధవ్, ఏ రాధాకష్ణ, పి రమేష్ బాబు, తంజావూరు మురళి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం రఘు, సిద్దు, ప్రభాకర్ పాల్గొన్నారు.

వాలంటీర్లు వారథులు : మేయర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ఎప్పటికప్పుడు సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ప్రజాసేవకులని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. తిరుపతి నగరపాల సంస్థ కార్యాలయంలో బుధవారం 27వ డివిజన్ కు సంబంధించి 17 మంది వార్డు వాలంటీర్లకు సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు. 27వ డివిజన్ వైఎస్ఆర్‌సిపి నాయకులు భరణి యాదవ్, గోపాల్ రెడ్డి, చింతా రమేష్, గీతా యాదవ్, సచివాలయ అడ్మిన్ సెక్రెటరీ గోపాల్ కష్ణ, పల్లవిపాల్గొన్నారు.

9, 10 తేదీల్లో పంజాబ్ రాష్ట్ర గవర్నర్ రాక

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పంజాబ్ రాష్ట్ర గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ ఈ నెల 9,10 తేదీలలో జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ డా.జి లక్ష్మీ శ ఒక ప్రకటనలో తెలిపారు. తేది 9న ఉదయం 11.05 గంటలకు చెన్నై విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుమల శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకొని రాత్రికి బస చేస్తారు. తేది 10 న ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని, 10.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని బెంగళూరు బయలుదేరి వెళ్లనున్నారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు రాష్ట్ర గవర్నర్ రాక

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ నెల 7 న గురువారం శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో జరగనున్న స్నాతకోత్సవంలో పాల్గొనడానికి విచ్చేయనున్నారని కలెక్టర్ డా.జి లక్ష్మీ శ ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం నుండి బయలుదేరి ఉదయం 10.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని , 11.30 గంటలకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగే స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొని అనంతరం మధ్యాహ్నం 2.50 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని బెంగళూరు వెళ్లనున్నారని తెలిపారు.

మౌలిక సదుపాయాలు మరోసారి పరిశీలించండి : కలెక్టర్

తిరుపతి టౌన్ : జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలను రోసారి ఈఆర్ఒలు వారి పరిధిలో సరి చూసుకోవాలని, రానున్న సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని కలెక్టర్ లక్ష్మిశ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఇనీ సమావేశ మందిరంలో క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్, ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో డిఆర్ ఓ పెంచల్ కిషోర్, ఈ ఆర్ ఓ లు కోదండ రామిరెడ్డి, చంద్రముని, నిషాంత రెడ్డి, కిరణ్ కుమార్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వలస కార్మికుల..దిక్కులేని చావు

గాలికొదిలేస్తున్న కాంట్రాక్టర్లు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఉన్నచోట ఉపాధి లేక పొట్ట కూటికోసం కడుపు చేత పట్టుకుని పని కోసం వందల కిలోమీటర్లు దాటి వస్తున్న వలస కార్మికులకు పని ప్రదేశాల్లో కనీస భద్రత లేకుండా పోతోంది. వారు గాయపడ్డా..మృత్యువాత పడ్డా పట్టించుకునే నాథుడు కరువవుతున్నాడు. పని కోసం ఒరిస్సా, బీహార్, ఉత్తర ప్రదేశ్‌లాంటి రాష్ట్రాలనుంచి వలస కార్మికులను అరువు తెచ్చుకుంటున్న కాంట్రాక్టర్లు వారికి కష్టమొస్తే గాలికి వదిలేస్తున్నారు. గాయపడ్డాకనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో వలస కార్మికులు యాచకులుగా మారిపోవాల్సి వస్తోంది. ఇలాంటి సంఘటనే ఇటీవల పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి పోతే...బీహార్ రాష్ట్రం మమకాడ్ గ్రామానికి చెందిన లక్ష్మణ్(58)ను పట్టణంలోని రాజీవ్ నగర్‌లో భవన నిర్మాణ పనులకు ఓ కాంట్రాక్టర్ ఒప్పించి రప్పించుకున్నాడు. లక్ష్మణ్ భవనం పైనుంచి కింద పడటంతో అతని వెన్నుముకకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయన్ను కనీసం ఆసుపత్రిలో వైద్యం కూడా అందించకుండా రాజీవ్ నగర్‌లోని శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధాన రోడ్డు మార్గం పక్కన ఓ చెట్టుకింద వదిలి పెట్టి పోయారు. దీంతో లక్ష్మణ్‌కు సరైన వైద్యం అందక, నడిచే ఓపిక లేక చివరకు యాచకుడిగా మారిపోయాడు. రోడ్డుకిరువైపులా ఉండే దుకాణదారులు ఏమైనా పెడితేనే లక్ష్మణ్‌కు కడుపు నిండేది. లేకుంటే పస్తే. కనీసం ఆయన్ను బీహార్ నుంచి తీసుకొచ్చిన కాంట్రాక్టర్ ఎవరో కూడా లక్ష్మణ్‌కు తెలియని పరిస్థితి. ఆయనతో పాటు వచ్చిన వలస కూలీలు కూడా కాంట్రాక్టర్ ఒత్తిళ్లకు తలొగ్గి తమకెందుకులే అని ఒంటరిగా వదిలి వెళ్లిన పరిస్థితి. దీంతో లక్ష్మణ్ గత నెల రోజులుగా ఓ చెట్టుకింద ఎండక, వాననక, రేయనక, పగలనక ఓ యాచకుడిలా కాలం వెల్లదీయాల్సిన దుస్థితి దాపురించింది. లక్ష్మణ్‌కు తన గ్రామంలో భార్య,

చెట్టుకింద భిక్షాటన చేస్తున్న వలస కార్మికుడు

భరణి, జగదీష్, బాలా ముగ్గురు కొడుకులు కూడా ఉన్నట్లు చెబుతుండటం గమనార్హం. గతంలో ఐజర్ సంస్థలో నిర్మాణాలు చేపడుతున్న కార్మికులు అస్వస్థతకు గురయ్యారు.

- **వలస చట్టాలేం చేస్తున్నాయి..?**

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇండస్ట్రియల్ కారిడార్ గా దినదినాభివృద్ధి చెందుతోంది. రేణిగుంట, శ్రీకాళహస్తి రూరల్ మండలం, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల పరిధిలో వందలాది పరిశ్రమలు, క్వారీలు, క్రషర్లు, ఇటుక బట్టీల్లో వేలాది మంది వలస కార్మికులు పని చేస్తున్నారు. జిల్లాల పునర్వవస్తీకరణ అనంతరం ఏర్పడ్డ తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి పారిశ్రామికవాడ ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా శ్రీకాళహస్తి ప్రాంతంలో ఫార్మ, స్టీల్ పరిశ్రమలతో పాటు, భవన, ఇటుక బట్టీలు, క్వారీలు, క్రషర్లలో ఎక్కువశాతం ఒరిస్సా, కలకత్తా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది వలస కార్మికులు పొట్టకూటి కోసం పరిశ్రమల్లో కార్మికులుగా పని చేస్తున్నారు. అదేవిధంగా భవన నిర్మాణ రంగంలో కూడా వందలమంది వలస కార్మికులు పనిచేస్తున్నారు. కార్మిక చట్టం ప్రకారం కార్మిక శాఖ అధికారులు వలస కార్మిక చట్టాన్ని అనుసరించి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల వివరాలన్నింటినీ సేకరించాల్సి ఉంది. అయితే ఈ ప్రాంతంలో వలస కార్మిక చట్టం అమలు జరగలేదు. వలస కార్మికులు ఎంతమంది, ఏ పరిశ్రమలో పని చేస్తున్నారు.? ఎక్కడ నివాసముంటున్నారు.? వారికి జీతం ఎంత ఇస్తున్నారు..? తదితర వివరాలు సైతం కార్మిక శాఖ వద్ద లేకపోవడం గమనార్హం. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు పరిశ్రమల్లో ఇలాంటి తరహా ఘటనలు చాలా జరిగాయనీ, అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై చనిపోయిన వారి కుటుంబాలకు పదో పరకో ఇచ్చి రాజీ చేసేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అసలు వలస కార్మికుల ప్రాణాలకు విలువే లేదన్నట్లు ఇక్కడి అధికారులు, కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

లక్ష్మణ్‌కు న్యాయం చేయాలి: పెనగడం గురవయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి

పనిలో గాయపడి కాంట్రాక్టర్ పటించుకోక యాచకుడిగా మారిన లక్ష్మణ్ ను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి. ఆయనకు న్యాయం చేయాలి. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి. శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని అన్ని పారిశ్రామికవాడల్లో కార్మిక చట్టాన్ని అమలు చేయాలి. కార్మికుల వివరాలను వెంటనే సేకరించాలి. విధులు నిర్వహిస్తున్న వలస కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది.

'హద్దులు' మీరి 'నిర్మాణాలు'

యథేచ్చగా కాల్వ పోరంబోకు కబ్జా

2019లో వేసిన హద్దులు బేఖాతర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

పట్టా భూమి పక్కనే కాల్వ పోరంబోకు స్థలం.. దాన్ని ఎంచక్కా కలుపుకుంటే ఆస్తి కలిసొస్తుందని కబ్జాదారులు నెమ్మదిగా కాల్వ పోరంబోకు స్థలంపై గ్రావెల్ తోలి భౌగోళిక స్వరూపాన్నే క్రమేపీ మార్చేస్తూ వచ్చారు. ఈ తంతు తెలిసిన అర్బన్ రెవెన్యూ అధికారులు 2019, డిసెంబర్ 22న పట్టా భూమిని, ప్రభుత్వ భూమిని వేరు చేస్తూ పొడవాటి కందకాన్ని తవ్వి హద్దు లేర్పరిచారు. అయితే ఆ భూమి మళ్లీ కబ్జాకు గురవుతోంది. తిరుపతి అర్బన్ మండలం ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 118లో దాదాపు రెండు ఎకరాల కాల్వ పోరంబోకు భూమి ఉంది. దీన్ని ఆనుకుని సర్వే నంబర్ 116లో ప్రైవేట్ వ్యక్తికి చెందిన పట్టా భూమి ఉంది. నాడు రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పరచిన ప్రభుత్వ భూమిలో యథేచ్చగా నేడు అక్రమ నిర్మాణాలు జరిగిపోతున్నాయి. అయినా ఇప్పటి రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం వెనుక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గతంలో ఇదే భూమిలో...

సర్వేనెంబర్ 118 లోని ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేస్తుండడంతో అప్పట్లో దినపత్రికలలో కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో రెవెన్యూ అధికారులు అడ్డుకొని ప్రభుత్వ భూమిగా సూచిస్తూ బోర్డును ఏర్పాటు చేశారు. కొన్ని నెలల పాటు అలానే ఉన్న ప్రభుత్వ సూచిక బోర్డు నేడు మాయమైపోయింది. నేడు గుట్టు చప్పుడు కాకుండా ప్రధాన మార్గం నుండి స్థలంకు లోపల గల ముళ్ళ చెట్లను తొలగించి గది నిర్మాణాలు పూర్తిచేసి రంగులు కూడా వేసేశారు. నిర్మించిన గది వెనుక భాగాన వెళుతున్న కాలువపై కప్పులను నిర్మిస్తున్నారని సమాచారం. దశాబ్దాల పాటు మంగళం శెట్టిపల్లి రోడ్డు మార్గం సరిగా లేకపోయినా భూమి విలువ కోట్లకు చేరుకుంది. ప్రస్తుతం టీటీడీ సహకారంతో మంగళం-శెట్టిపల్లి మార్గాన్ని కలుపుతూ 80 అడుగుల రోడ్డు మార్గం నిర్మాణానికి మార్గం సుగమమయ్యింది. ఈ నేపథ్యంలో కబ్జా దారుల కన్ను మళ్లీ సర్వే నంబర్ 118 పై పడింది. ఈ నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధుల్లో తలమునకలు అవడంతో కబ్జాదారులు భారీ పథకాన్ని రచించారు. ఈ కబ్జా తంతుపై అర్బన్ రెవెన్యూ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

2019లో హద్దులు ఏర్పాటు చేస్తున్న రెవిన్యూ అధికారులు


నేడు అదే స్థలంలో ఇల్లు కట్టిన వైనం

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

మున్సిపాలిటీల్లోని కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామమేశ్వరరావు డిమాండ్‌చేశారు. గూడూరు సిఐటియు కార్యాలయంలో గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపల్ పారిశుధ్య కార్మికుల జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఇంజినీరింగ్, క్లాప్ డ్రైవర్లు, పర్మినెంట్‌కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగిస్తున్నామన్నారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగామున్సిపల్ కార్మికులు 15 రోజులు పోరాడి ప్రభుత్వం మెడలు వంచి విజయం సాధించారన్నారు. శానిటేషన్ విభాగంలో 36వేల మందికి 15వేల నుంచి 21వేలకు, 18,500 నుంచి 24,500కు జీతాలు పెంచడం పోరాటం వల్లేనన్నారు. మొట్టమొదటిసారిగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అద్యక్షులు జి.బాలసుబ్రణ్యం, గూడూరు నాయకులు జోగి శివకుమార్, జి.రాజు, బివి రమణయ్య, బి.గోపీనాథ్, సురేష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని గమళ్ల పాలెంలోని ఓం శ్రీ సాయిరాం వృద్ధాశ్రమంలో మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదా నం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చు కోవాల న్నారు. యువత సేవా కార్యక్రమాల వైపు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి మహేశ్వరి, హోమ్ కేర్ కళ్యాణి పాల్గొన్నారు.

'మహేంద్ర ఎలక్ట్రికల్ వెహికల్ సైకిల్ మార్ట్' ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని హాస్పిటల్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మహేంద్ర-ఎలక్ట్రికల్ వెహికల్ సైకిల్ మార్ట్ ను మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. కాలుష్య నివారణకు ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, వెదనపర్తి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి స్నేహభావం అలవరుచుకోవాలి

ప్రజాశక్తి- కేవీబి పురం: ప్రతి విద్యార్థి చిన్నతనం నుండే స్నేహభావం అలవరుచుకుని విద్యార్థులు చదువుకొని గొప్ప స్థాయికి వెళ్లాలని ఉన్నత స్థాయిలో ఉన్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశం చిన్నతనం నుండి రావాలని ప్రధానోపాధ్యాయుడు వెంకట కృష్ణయ్య పేర్కొన్నారు. కెవిబిపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977-1982 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 28 మంది వారి జ్ఞాపకార్థం పాఠశాల ఆవరణలో సరస్వతి ఆలయం నిర్మించారు. ఈ ఆలయాన్ని బుధవారం వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట కృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుండే స్నేహభావాన్ని అలవరుచుకుని గొప్ప స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా: ఎస్ఐ

ప్రజాశక్తి - బాలాయపల్లి : సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచామని స్థానిక ఎస్ఐ మహబూబ్ సుభాన్ పేర్కొన్నారు. మండలంలోని పాతపాళెం, జయంపు గ్రామంలో పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని ప్రతి ఒక్కరూ సహక రించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఓటు వేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడా లని కోరారు. ఎవరూ గొడవలకు వెళ్ల వద్దన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

తాగునీటి కుళాయి పునరుద్ధరణ

కమిషనర్‌కు ప్రజల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఉన్న కుళాయిని తొలగించారని వెంటనే పునరుద్ధరించాలని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి కుళాయి కనెక్షన్ పునరుద్ధరించారు. దీంతో సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్ వెంకటేష్, ప్రజలు, ప్రయాణి కులు, వృద్ధులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, ఆటో కార్మికులు కమిషనర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏ విజయ్, కే ఆర్ సుబ్రమణ్యం పిళ్లై, రవి, కృష్ణమూర్తి, రమేష్ బాబు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణం జయరామారావువీధి, ఇందిరానగర్‌కు చెందిన 200 కుటుంబాలు చెందిన ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు సుమారు బుధవారం వైసీపీ నుంచి టిడిపిలో చేరారు. టీడీపీ శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్జం కిషోర్ ఆధ్వర్యంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వీరికి కండువా కప్పి ఆ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీ కుటుంబాలకు తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎన్నో సేవలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు విజయకుమార్, చెంచయ్య నాయుడు, వసంత గుర్రప్ప శెట్టి, బీడీ నారాయణ, ఖాదర్ బాషా, రఫీ, మహమ్మద్, యశ్వంత్, మణికంఠ, వివేక్, రాకేష్, మహేష్, లోకేష్, నవీన్,రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం గొల్లపల్లి హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సమావేశం గొల్లపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి భారతి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల హాజరయ్యారు. ఆ పాఠశాల హిందీ ఉపాధ్యాయులు ఎస్ శ్రీరాములు విద్యార్థులకు విద్యా సామగ్రి అందించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీమతి భారతి మేడం మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల భక్తి రంజని

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ధూర్జటి కళాప్రాంగణంలో బుధవారం శ్రీకాళహస్తి పట్టణం దిగువ విద్యార్థిని సి.కీర్తనారెడ్డి, సి. విమలేష్ రెడ్డి అలరించిన భక్తి రంజని అలరించింది. ఈ చిన్నారులు ఆలపించిన ఐదు భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. అతి చిన్న వయసులోనే ఈ చిన్నారులు మంచి స్వరంతో ఆలపించడం చూసి పలువురు అభినందించారు. భక్తి రంజని ముగిసిన తరువాత ఈ చిన్నారులను ఆలయ అధికారులు సత్కరించి ముక్కంటి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు: డిఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీ మహాశివరాత్రి పర్వదినాన ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీకాళహస్తి డిపో మేనేజర్ రాజవర్ధనరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి- తిరుపతి మార్గంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. నాయుడుపేట మార్గంలో ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. పిచ్చాటూరు మార్గంలో ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. నాన్ స్టాప్ సర్వీసులు శ్రీకాళహస్తిలోని బ్రిడ్జి దగ్గర ఉన్న స్వర్ణముఖి పాయింట్ నుంచి నడుస్తాయని తెలిపారు. ఆర్టీసీ బస్సులు శ్రీకాళహస్తి బస్టాండ్ వరకు నడుస్తాయన్నారు. చెన్నైకి అదనంగా సర్వీసులు ఏర్పాటు చేశామని రాజవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. చెన్నైకు మొత్తం 10 బస్సులు నడుపుతామన్నారు. భక్తులు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ: మహా శివరాత్రి రోజున బాల్య వివాహాలు జరిపిస్తే కఠిన చర్యలు తప్పవని బుచ్చినాయుడు కండ్రిగ సబ్ ఇన్స్పెక్టర్ వెంకట నరసింహం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండక ముందు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పాండూరు జ్యోతి నగర్ జ్యోతి స్వరాల యం, వరదయ్యపాలెం శివాలయంలో, శ్రీకాళహస్తి కి చెందిన శివాలయంలో బాల్య వివాహాలు జరుగుతాయని సమాచారం. ఫోన్ నెంబర్ నెంబరు9440900723 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఏర్పేడు: ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా బాల్య వివాహాలపై మునగలపాలెం జడ్పీహెచ్ఎస్‌లో అవగాహన సదస్సు, పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునగలపాలెం ఇన్‌ఛార్జి హెచ్ఎం నాగమణి, ప్రగతి మండల కోఆర్డినేటర్ సుభాన్ బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు లావణ్య, ఎఎన్ఎం కస్తూరి, ఆశ వర్కర్ కవిత, అంగన్‌వాడీ వర్కర్ తెలజ, ప్రగతి సంస్థ అగ్గనైజర్ సుమలత, రాజేశ్వరి పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి-కరకంబాడి మార్గంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో పలు రంగాలలో రాణిస్తున్న స్ఫూర్తిదాయక మహిళలతో కలిసి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. నాదముని రెడ్డి మాట్లాడుతూ మహిళల్లో అక్షరాస్యత శాతాన్ని పెంపొందించుకోవాలన్నారు. మహిళల ప్రాధాన్యత కోసం యునైటెడ్ నేషన్స్ 2024లో 'ఇన్స్పైర్ ఇంక్లూషన్' అనే అంశాన్ని ప్రతిపాదించిందన్నారు. అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యురాలు చొప్పా దీప్తి మాట్లాడుతూ మహిళల్లో కష్టపడే తత్వం, నాయకత్వ లక్షణాలు వారి సంతానం అందిపుచ్చుకుంటారనే చూడాలన్నారు. అనంతరం హాస్పిటల్స్ ఎండి డాక్టర్ గౌరవేని రమాదేవి, మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సీతాకుమారి, అంకాలజిస్ట్ లక్ష్మీ సంధ్య పాల్గొన్నారు.

బీసీలను మభ్య పెట్టొద్దు: భాస్కర్ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలకు రాజకీయ పార్టీలు సంక్షేమ పథకాలతో ఉద్ధరిస్తామని మభ్యపెడుతున్నారని, ప్రతి జిల్లాలో మూడు నియోజకవర్గాలు బీసీలకు కేటాయించాలని బీసీ కులాల సమాఖ్య తిరుపతి జిల్లా శాఖ కన్వీనర్ భాస్కర్ యాదవ్ అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళగిరిలో జరిగిన జనసేన టిడిపి ఉమ్మడి జయహో బీసీ కార్యక్రమంలో బీసీ డిక్లరేషన్ పై స్పందించాలని స్వాగతిస్తున్నామని, పొత్తులో ఉన్న ఐదు పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 175 నియోజకవర్గాల్లో తమ భాగం ఎమ్మెల్యే సీట్లు బీసీలకు ఎంతమేర ఇవ్వబోతున్నారో ప్రకటించాలని, వైసిపి తన మేనిఫెస్టోలో బీసీల భద్రతకై చట్టాన్ని తీసుకొస్తామని హామీ ఇవ్వాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు, విజయ్, గురవరాజు పాల్గొన్నారు.

జగనన్న ఇంటి స్థలాలు ఎందుకు చూపలేదు?

తహశీల్దారు కార్యాలయం వద్ద ఎర్రగుట్ట గుడిసె వాసుల ధర్నా

ప్రజాశక్తి -రేణిగుంట : గత నెల 27వ తేదీ ఎర్రగుట్ట గుడిసె వాసులను పోలీసు, రెవెన్యూ కలిసి దాడి చేసి గుడిసెలు తొలగించారని, ఖాళీ చేయించి పది రోజులు పూర్తవుతున్న ఎర్రగుట్ట గుడిసె వాసులకు స్థలం కేటాయిస్తామని గాని, న్యాయం చేస్తామని గానీ ఇప్పటి వరకు ఎందుకు ప్రకటించలేదు?' అని ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు తహశీల్దారు కార్యాలయం వద్ద రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ కరకంబాడి పంచాయతీలో జగనన్న పట్టాలు ఇచ్చి మూడున్నర సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకు స్థలం చూపించలేదని, అదే ప్రాంతంలో రేషన్ కార్డ్, ఆధార్ కార్డు ఉండి అర్హులుగా గుర్తించిన కుటుంబాలకు జగనన్న ఇళ్ల స్థలం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కరకంబాడిలోని ఫోర్ లైన్ హైవే కి పోతున్న ఎస్సీ, ఎస్టీ కాలనీ ప్రజలకు నష్టపరిహారం చెల్లించలేదని చట్ట ప్రకారం బాధితులకు రావలసిన నష్టపరిహారం ఇస్తూ ఐదు సెంటుల ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. మరోపక్క కరకంబాడి పంచాయతీలో ప్రభుత్వ భూములు కబ్జాదాల ఆక్రమణ చేసి అమ్ముకుంటున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం విడ్డూరమని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 1503/1 ఉన్న 125 ఎకరాల ఆరు సెంట్లు భూమిని సిద్దుల రవి కొండను లోడుకొని మట్టిని అమ్ముకుంటున్నా అధికారులు, పోలీసు వ్యవస్థ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ప్రభుత్వ భూములు కబ్జాకు గురై నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి భూమి లేదా?' అని రెవెన్యూని ప్రశ్నించారు. ప్రజానాట్యమండలి నాయకులు సెల్వ రాజ్ మాట్లాడుతూ జగనన్న పట్టాలిచ్చి నాలుగేళ్లు పూర్తవుతున్నా స్థలం చూపించడంలో రెవెన్యూ ఆలస్యం ఎందుకు చేస్తోందని ప్రశ్నించారు. మాజీ

మాట్లాడుతున్న ఇళ్ల స్థలాల పోరాట కమిటీ అధ్యక్షులు రాజశేఖర్

వార్డ్ మెంబర్ సత్య శ్రీ మాట్లాడుతూ ఎమ్మెల్యే మస్తాన్ రెడ్డి ఎర్రగుట్ట గుడి వద్ద 10 రోజుల్లో న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ఇచ్చిన మాటనే రేణిగుంట రెవెన్యూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్, ఆర్డిఓ, రేణిగుంట తహశీల్దారు జోక్యం చేసుకొని ఇల్లు లేని నిరుపేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు ప్రశాంతు కుమారి, దీప, జ్యోతిష్ , లోకేష్, అమీర్జాన్, ముని రాజమ్మ, అరుణ్ కుమార్, పవిత్ర, పార్వతి, మణి, సుభాష్ సుధాకర్ మస్తాన్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ట్రాఫిక్ నిబంధనలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీ శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహాశివరాత్రి రోజు భక్తులు వేల సంఖ్యలో విచ్చేసే అవకాశం ఉన్నందున రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలు విధిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తిరుపతి, నెల్లూరు వైపు నుంచి వచ్చే భక్తులు వారి కార్లను, బస్సులను పొన్నాలమ్మ గుడివద్ద మార్కెట్ యార్డ్ లో పార్క్ చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలు రివర్ వ్యూ రిసార్ట్ కు ఎదురుగా వెళ్లే నది ఒడ్డున మట్టి దారిలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. చెన్నై, పిచ్చాటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ మీదుగా వెళ్లి, హైవే ఎక్కి ఏపీసీడ్స్ మీదుగా మార్కెట్ యార్డ్ వద్దకు రావాలని కోరారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి ఉచిత బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. ఉచిత బస్సులు ప్రతి 10 నిమిషాలకు ఒకటి ఉంటుందన్నారు. ఉచిత బస్సు ఎక్కిన వారు సాంస్కృతిక కార్యక్రమాల వేదిక పక్కన కొత్తగా నిర్మించిన నాలుగు వరుసల రోడ్ వద్దకు వచ్చి గుడికి, క్యూ లైన్లకు సమీపంలో దిగుతారన్నారు. దర్శనం అనంతరం అక్కడే ఉచిత బస్సు ఎక్కుతారని పోలీసులు తెలిపారు. ఉచిత బస్సులు రైల్వే స్టేషన్, ఏపీ సీడ్స్, మార్కెట్ యార్డ్, ఆర్టీసీ బస్టాండ్, వీఎంసీ కూడలి నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. మాడ వీధుల్లో స్వామి ఊరేగింపు సమయంలో ఆర్టీసీ బస్టాండు, వీఎంసీ కూడలి నుంచి వచ్చే ఉచిత బస్సులు కొంతసేపు ఆపుతారన్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తిలో నివసించే స్థానికులు నిబంధనలకు సహకరించి శివరాత్రి దర్శనాలు సజావుగా సాగేలా చూడాలని కోరారు. ఆటోలు కూడా పొన్నాలమ్మగుడి, వెంకటగిరి బస్టాండ్ వరకు మాత్రమే తిప్పాలని కోరారు. పట్టణంలో తిరిగే ఆటోలు మాడ వీధులను తప్పించి తిరగాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌పి మెస్‌ను ప్రారంభించిన మేయర్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్పీ మెస్ ను కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించారు. స్థానిక కరకంబాడి రోడ్డులోని డి మార్ట్ పక్కన రెడ్డి గుంటలో బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భోజనం ఆహార పదార్థాలు సరఫరాలో విశేష అనుభవం గడించిన నాగరాజు యాదవ్ బందం పీకె లేబెట్‌లో కొన్ని సంవత్సరాలుగా క్యాటరింగ్ సంస్థను నిర్వహిస్తోందన్నారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని తక్కువ ధరలకు అందించాలని ఉద్దేశంతో కరకంబాడి మార్గంలో ఎస్పీ మెస్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఆ సంస్థ అధినేత ఎన్. నాగరాజ యాదవ్ మాట్లాడుతూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం చికెన్ బిర్యాని అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధాకష్ణ, అనిల్ కుమార్, లక్ష్మీ యాదవ్, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన 'పది' ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి -బుచ్చినాయుడుకండ్రిగ: పదవ తరగతి ప్రశ్నా పత్రాలను బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్ స్టేషన్ స్ట్రాంగ్ రూములో బుధవారం భద్రపరిచారు. పరిశీలన అధికారులు, చీఫ్‌లు లక్ష్మయ్య సంబంధ చెట్టి, పరీక్షల కేంద్ర డిపార్టుమెంట్ అధికారులు ఆదిశేషయ్య, రమణయ్య ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రాలను సీల్ వేసి పోలీస్ స్టేషన్ లోని స్ట్రాంగ్ రూములో ఎస్ఐ వెంకట నరసింహ ఆధ్వర్యంలో భద్రపరిచారు. గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. పోలీసుల సమక్షంలో పరీక్షల సమయంలో ఆ ప్రశ్న పత్రాలను రోజువారి టైం టేబుల్ ప్రకారం తీసుకు వెళ్లనున్నారు. చల్లమాంబాపురం, పల్లమాల, బుచ్చినాయుడు కండ్రిగ, నెలవాయి, కల్లివెట్టు, ప్రైవేటు పాఠశాలలు శ్రీనివాస్ తేజ, వికాస్ పాఠశాల, పూజిత పాఠశాల ప్రశ్నాపత్రాలను ఇక్కడ భద్రపరిచారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థు ల మొత్తం సంఖ్య ఏ బ్లాక్ 200 మంది, బి బ్లాకు 198 మంది మొత్తం 398 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని వీరిలో ఎక్కువ శాతం బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 153 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అటెండర్ లక్ష్మయ్య సహాయకులుగా నిర్వర్తించారు.



పోలీసు స్టేషన్‌లో భద్రపరిచిన టెన్తు ప్రశ్నాపత్రాలు

మహిళలపై వేధింపులు అరికట్టాలి

- స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర నాయకులు జి సునీత

ప్రజాశక్తి - క్యాంపస్ : దేశంలో, రాష్ట్రంలో మహిళలపై ప్రేమ పేరిట, ర్యాగింగ్ పేరిట, కుల, మత ప్రాంతాల పేరిట వివక్షకు, లైంగిక వేధింపులకు గురవుతున్నారని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర నాయకులు జి.సునీత పేర్కొన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం సందర్భంగా అంబేద్కర్ భవన్ వద్ద పిడిఎస్ఓ ఆధ్వర్యంలో బుధవారం సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు తిరుపతి జిల్లా కార్యదర్శి ఆర్ ఆశ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర నాయకులు జి సునీత మాట్లాడుతూ ప్రేమ పేరిట, ర్యాగింగ్ పేరిట, కుల, మత ప్రాంతాల పేరిట వివక్షకు, లైంగిక వేధింపులకు మహిళలు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం స్ఫూర్తితో దేశంలో పసిపిల్లలపై, మహిళలపై సాగుతున్న అన్ని రకాల శారీరక, మానసిక లైంగిక వేధింపులకు, అణచివేతలకు, అత్యాచారాలకు, హత్యలకు కారణమవుతున్న విష సంస్కృతిని పెంచి పోషిస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, మహిళలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. డాక్టరు డి గోవిందులు మాట్లాడుతూ అత్యాచారమో, హత్యో జరిగి ప్రజల్లో ఆగ్రహం వెలువెత్తినప్పుడల్లా నిర్భయ, దిశ వంటి చట్టాలు తీసుకొస్తూ, ఆడపిల్లల వస్త్రధారణ, వ్యవహార శైలే ఈ దాడులకి కారణమని చెప్తూ బాధితులనే నిందితుల్ని చేస్తున్నారని, మూల కారణాలైన మద్యం, మత్తు పదార్థాలు, అశ్లీల సినిమాలను నిషేధించాలని ఏ పాలకుడూ మాట్లాడటం లేదన్నారు. విద్యార్థినులపై, మహిళలపై జరుగుతున్న అన్ని రకాల దాడులకు అసలు వాస్తవాలను అర్థం చేసుకొని నిర్మూలనకు విద్యార్థులు, మహిళలు ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సునీత

బీసీల అభివృద్ధికి నిరంతర పోరాటం

- మర్లపల్లి గోపి పిలుపు

ప్రజాశక్తి -కోట : రాష్ట్రంలో బీసీ కులాల ఐక్యత, ఆర్థిక అభివృద్ధికి సమాజంలో అన్ని రంగాల్లో ముందుకు తీసుకోవటమే లక్ష్యంగా నిరంతరం పోరాటం చేస్తానని నాయకులు మర్లపల్లి గోపి అన్నారు. స్థానిక గోపాల్ రెడ్డి విగ్రహం సమీపంలో బీసీ కులాల వేదిక కార్యాలయంను ఏర్పాటు చేశారు. ఈ ఈ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఉప్పల కోటేశ్వరరావు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప్పల కోటేశ్వరరావును బీసీ నాయకులు శాలువా పూలమాలతో సత్కరించి ఆహ్వానించారు. ఉప్పల కోటేశ్వరరావు చేతులు మీదగా బీసీ సంఘాల వేదిక కార్యాలయంను ప్రారంభించారు. అనంతరం వ్యాపారవేత్త మర్లపల్లి గోపి మాట్లాడుతూ బీసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య స్ఫూర్తితో ముందుకెళుతూ పోరాటం చేస్తామని తెలిపారు. నిరుపేద బీసీ కులాలకు చెందిన ఐదు కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 20 వేల రూపాయలు చొప్పున రెండు లక్షల 50 వేలు, మరో వ్యక్తి ఉప్పల కోటేశ్వరరావుకు 20 వేల రూపాలను కలిపి మొత్తం 2 లక్షల 70 వేల రూపాయలను ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త మర్లపల్లి గోపి, యాకసిరి రవి కనుపూరు జగదీష్, ఇరగరాజా రవి, తదితర బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి లక్ష్మిరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వారు అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మిరెడ్డి అన్నారు. మండలంలోని రమణయ్యగారిపల్లి పంచాయతీలో 'గడపగడపకు మన ప్రభుత్వం'ను బుధవారం నిర్వహించారు. లక్ష్మిరెడ్డి స్థానిక నాయకులతో చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఆదరించి గెలిపించాలని కోరారు. నవరత్నాల ద్వారా మహిళల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్ఆర్ ఆసరా, చేయూత,అమ్మఒడి వంటి పథకాలు అమలుచేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జననన్న మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న చెవిరెడ్డి లక్ష్మిరెడ్డి

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం: మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ధ్వజమెత్తారు. గూడూరు పట్టణంలో 2వేల మంది టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలతో టవర్ క్లాక్ సెంటర్ నుండి టీడీపీ కార్యాలయం వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మిత్రబృందం ఆధ్వర్యంలో క్రేన్‌తో భారీ గజమాలను వేసి మాజీ ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ వాహనంలో మాజీ ఎమ్మెల్యే ర్యాలీలో పాల్గొన్నారు. నాయకులందరూ కలిసి గమళ్లపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో పట్టణాధ్యక్షులు పులిమి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. మళ్లీ రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే చంద్రబాబును సీఎం చేసుకో వాల న్నారు. ఆత్మస్థైర్యాన్ని కోల్పోయే పరిస్థితుల్లో పవన్ మద్దతు మరువ లేనిదని అన్నారు. పట్టణంలోని గమళ్ల పాలెం టీడీపీ కార్యాలయంలో బుధవారం 500 మంది ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, షేక్. జహంగీర్, ముమ్మడి వెంకటేశ్వర్లు, ఆర్ఎస్కే సద్దాం హుస్సేన్, వేముల సునీల్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు హసనాపురం వెంకటేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి ర్యాలీలో పాల్గొన్న పాశం సునీల్‌కుమార్

జనరిక్ మందులతో అధిక ప్రయోజనం: డిసిఎల్ఓ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తక్కువ ఖర్చుతో అధిక ప్రయోజనం లభించే జనరిక్ మందులను ప్రజలు కొనుగోలు చేసుకోవాలని డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి రవి రాజశేఖర్ తెలిపారు. గూడూరు పట్టణంలోని గూడూరు నెం 24 పిఎసిఎస్ కార్యాలయ ఆవరణలో ప్రధానమంత్రి జన ఔషధీ కేంద్రాన్ని డీసీఎల్ఓ బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిసిఎల్ఓ మాట్లాడుతూ గూడూరు మండలంలోని ప్రజలకు ఉపయోగపడేలా గూడూరు నెం 24 పిఎసిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసేందుకు చైర్మన్ అట్ల శ్రీనివాసులు రెడ్డి, సిఈఓ యనమల నారాయణ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు నెం 24 పిఎసిఎస్ చైర్మన్ అట్ల శ్రీనివాసులు రెడ్డి, గూడూరు ఎంపిపి బూదూరు గురవయ్య, గూడూరు ఎంపి ఏసి ఎస్, సిఈఓ యనమల నారాయణ, గూడూరు నెం 24 పిఎసిఎస్ డైరెక్టర్లు మనుబోలు కృష్ణయ్య, రవీంద్ర రాజు, తిప్పగుంటపాలెం పిఏసీ ఎస్ సీఈఓ రామానాయుడు, మాజీ ఏఎంసి చైర్మన్ బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందుల షాపు ప్రారంభిస్తున్న డిసిఎల్‌వో

క్రైం న్యూస్

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని వినాయకుని గుడి వద్ద అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్ఈబి కార్యాలయంలో ఎస్ఈబి సిఐ రమేష్ మాట్లాడుతూ తమిళనాడుకి చెందిన జయకుమార్, గుణ శేఖరన్ అనకాపల్లిలో అరుణ్ అనే వ్యక్తి వద్ద 8 కేజీల గంజాయిని కొనుగోలు చేసి చెన్నైకి తీసుకొని వెళ్తుతుండగా మార్గ మధ్యంలో గూడూరు ఆర్టీసి సమీపంలోని వినాయకుని గుడి దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతుండగా సాధారణ తనిఖీల్లో భాగంగా అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎస్ఐ బ్రహ్మానాయుడు, మోసెస్, కిరణ్ సింగ్, రమేష్, ప్రసాద్ , కృష్ణయ్య, గౌస్ బాషా, ఆనంద్ బాబూ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఓ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధించారు. 2022 సంవత్సరంలో నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో జరిగిన హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గూడూరు కోర్టు తీర్పునిచ్చింది. పోలీసుల కథనం మేరకు డబ్బులు అడిగితే ఇవ్వనందుకు ఓ దుకాణం వద్ద వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని వీరస్వామి సూది దబ్బతో పొడవడంతో వెంకటేశ్వర్లు మృతి చెందారు. ఈ మేరకు అప్పట్లో నాయుడుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సుమారు ఒకటిన్నర ఏడాది తర్వాత ఈ కేసులో వాదోపవాదాలు విన్న న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుహాసిని బాధితుల తరపున కేసు వాదించారు. హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జునరావు లైజనింగ్ ఆఫీసర్ గా వ్యవహరించారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దుల మృతి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: విద్యుత్ షాక్‌తో ఎద్దులు మృతి చెందిన సంఘటన పిచ్చాటురు మండలం పులికుంద్రం లో బుధవారం చోటుచేసుకుంది. మాలగుంటకి చెందిన రవి బుధవారం ఉదయం తమ ఎద్దులతో పులిగుంద్రంకి చెందిన సెల్వం పొలంలో నిమగ్నమయ్యాడు. హఠాత్తుగా విద్యుత్ షాక్‌తో లక్ష రూపాయలు విలువ చేసే రెండు ఎద్దులు మృతి చెందాయి. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ, విద్యుత్ శాఖ అధికారులకు, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ శాఖ , పశు సంరక్షణ శాఖాధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంటు వచ్చినట్లు ప్రాథమిక నిర్ధారణ చేశారు. కూలి పనికి వెళ్లిన రవి రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. కుటుంబానికి భరోసా ఇస్తూ ఆర్థికంగా కుటుంబాన్ని పోషిస్తున్న తన ఎద్దులు మృతి చెంది తనను బతికించినందుకు రుణపడి ఉంటానని తెలిపాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

మాజీ ఉప రాష్ట్రపతిని కలిసిన యువకులు

ప్రజాశక్తి-నాయుడుపేట: మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుని నాయుడుపేట యువకులు బుధవారం కలసి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం రాత్రి ఢిల్లీ నుంచి నెల్లూరుకి విచ్చేసిన వెంకయ్య నాయుడుని ఆయనతో కొంత సన్నిహిత సంబంధాలు కలిగిన నాయుడుపేటకు చెందిన వ్యాపారవేత్త హంస బయో డీజిల్ ఫిల్లింగ్ స్టేషన్ అధినేత హంస పృథ్వీచంద్ , అతని స్నేహితుడు దువ్వూరు మధురెడ్డి తో కలసి ఆయన స్వగృహానికి వెళ్లి ఆయనకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వెస్ట్ వరత్తూరు ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఉదయం బుచ్చినా యుడు కండ్రిగ తహశీల్దారు మహమ్మదా లిఖాన్, మండల విద్యాశాఖ అధికారి కే రవీంద్రనాథ్ పోలింగ్ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. పరిశీలనలో భాగంగా అక్కడ ప్రధానోపా ధ్యాయులను కలిసి పాఠశాల పరిస్థితులను విద్యుత్, నీటి సౌకర్యం, పాఠశాల బిల్డింగ్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ కాలుష్యం లేకుండా పోలింగ్ కేంద్రానికి కల్పించాల్సిన అన్ని వసతులు సమకూర్చాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం రుచి చూసి చాలా రుచికరంగా ఉందని వంటవారిని పిలిచి వారికి కొన్ని సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబు నాయుడు, వీఆర్వో పాల్గొన్నారు.

ఔషధ రంగంలో ఫార్మసిస్టులదే కీలక పాత్ర

'సౌండ్ హిల్స్ ఫార్మసీ కళాశాల' లో నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డే

ప్రజాశక్తి -రామచంద్రపురం: రోగ నిరోధక ఔషధాలు తయారీ రంగంలో ఫార్మాసిస్టులదే కీలక పాత్ర అని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ నిరంజన్ బాబు అన్నారు. బుధవారం మండలంలోని వెంకటరామాపురం సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో నేషనల్ ఫార్మసీ ఎడ్యుకేషన్ డే - ఫార్మా అన్వేషన్ 2024ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు డాక్టర్ ఎస్ ఎల్ ఎన్ ప్రసాద్ రెడ్డి, కార్యనిర్వాహక కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఎం వెంకట రమణ లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ ఎల్ ఎన్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఫార్మసీ విద్యను స్థాపించడంలో ప్రొఫెసర్ ఎంఎల్ స్రాప్ పాత్ర కీలక మన్నారు. డాక్టర్ ఎం నిరంజన్ బాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించే ఈ కార్యక్రమానికి సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల కు స్పాన్సర్షిప్ కల్పించడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమా నికి గౌరవ ముఖ్యఅతిథిగా మైథిల్ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రజి తా రెడ్డి, క్రోమి మెడ్ కేర్ డైరెక్టర్ జి కృష్ణారెడ్డి. జగదీశ్వర్ రెడ్డి, ఎంజి రామచంద్రారెడ్డి,జె సూర్య కుమారి,కే దేవరాజ్, పి వెంకటేశ్వర్లు, విజయ్ భాస్కర్ రెడ్డి, కళాశాల బోధన్ ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కంటి అన్నదానానికి రూ.5లక్షల విరాళం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్న దానానికి రాజంపేటకు చెందిన రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి బుధవారం రూ.5,00,116 విరాళంగా అందించారు. ఆలయ కార్యనిర్వ హణా ధికారి ఎస్వీ నాగేశ్వర రావు ఈ విరాళం స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలిపి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి -పెళ్లకూరు: నాయుడు పేట ఐసిడిఎస్ భవనంలో మహిళా దినోత్సవాన్ని పురస్క రించుకొని అంగన్ వాడీలు, ఆయాలకు 'మహిళల ప్రాధాన్యత- సమాజం లో మహిళల పాత్ర' తదితర విషయాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ సమాజంలో పురుషులతోపాటు మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడుతూ పురుషలను అధిగమించి విజయాలను సాధిస్తున్నారని, ప్రజా ప్రతి నిధులు, ప్రభుత్వం మహిళ లకు ప్రోత్సాహకర చేయూత నివ్వా లని, వారి అభివృద్ధికి కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేయా లన్నారు. మహిళ లను ఉన్నత విద్య కు సాయం అందిం చా లన్నారు. 18 సంవత్సరా ల లోపు బాల్య వివాహాలు నేర మన్నారు. బాల్య వివాహాల నియంత్రణ ఈ కార్యక్ర మంలో నాయుడుపేట సూపరు వైజర్స్ ఆశా బేగం, మునెమ్మ, పెళ్లకూరు సూపరు వైజరు సాయి లక్ష్మి, ఓజిలి సుజనమ్మ పాల్గొన్నారు.

In the Court of the Hob'ble Senior Civil Judge, Gudur
H.M.O.P No.3/2023

Between
Mallepaddi Archana .... Petitioner
Vs
Mallepeddi Manedra Goud ...Respondent

Inssue to notice / suman

To
మల్లిపెద్ది మణేంద్రగౌడ్
తండ్రి సుబ్రమణ్యం
గూడూరు, తిరుపతిజిల్లా.

పై కేసులో మీ నుండి విడాకులు కోరుచు గూడూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు పిటీషనరు *H.M.O.P No: 3/2023* నెంబరుగల దావా దాఖలు చేసి వున్నారు. సదరు కేసులో నీకు నోటీసు నిమిత్తము 15-03-2024కు వాయిదా వేసివున్నారు. కావున నీవు తేది. 15-03-2024న ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకోగలవు లేనిచో పై కేసు నీ పరోక్షమున తీర్మానం చేయబడునని నీకు తెలియజేయడమైనది.
కేసు *H.M.O.P No: 3/2023*
వాయిదా తేది. 15/03/2024

CHAVA RAMBABU B.A.B.L.,
Advocate, Venkatagiri
Tirupati District.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL 1st CLASS MAGISTRATE: PUTTUR
I.A.No. 819/2023, I.A.No. 820/2023
I.A.No. 821/2023, O.S. No.116/2015.

BETWEEN:-
D. Pulla Reddy **...Petitioner/Plaintiff**
AND:-
D. Ravichandra Reddy and others
...Respondents/Defendants

NOTICES TO RESPONDENTS NO. 8 to 10

R8:- D. Bhavani, W/o Late D. Chandra Sekhar Reddy, Hindu, aged 53 years, Housewife,
R9:- D. Giri, S/o Late D. Chandra Sekhar Reddy, Hindu, aged 27 years, Private employee,
R10:- D. Likitha, D/o Late D. Chandra Sekhar Reddy, Hindu, aged 24 years, Housewife,No. 8 to 10 are residing at Samudayam Village and Post, Narayanavanam Mandal, Tirupati district.
...Proposed parties/Defendants No.8to10

Please take notices that, the above case was filed by the petitioner/plaintiff as against you and some others for partition in the above court and the same is posted on: 13.03.2024. Hence you are here by directed to attend before the above court at about 10-30 A.M. either by person or through Advocate. Otherwise the above case will be decided an exparty.

Hg. date: 13.03.2024

G. Raja Reddy, B.Com, LL.B.
P. Kumarvel, B.Com, LL.B.,
Advocates
Puttur.